
## కామారెడ్డి జిల్లాలో తగ్గిన క్రైం రేట్

### కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర



కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లాలో క్రైం రేట్ తగ్గిందని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. జిల్లాలో రోడ్డుప్రమాదాల నివారణకు తీసుకున్న భద్రతా చర్యలు, కట్టుదిట్టమైన నిబంధనల అమలు ఫలితంగా ఈ సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గత సంవత్సరం 6 నెలల కాలముతో పోల్చితే గణనీయంగా తగ్గిందని తెలిపారు. 2024లో 317 రోడ్డు ప్రమాదాలు జరుగగా 2025 లో 282కి తగ్గించగలిగామన్నారు. ముఖ్యంగా మరణాల కేసులు 152 నుండి 120కి అనగా 21% తగ్గుదల, మరణించిన వారి సంఖ్య 160 నుండి 125కి అనగా 22% తగ్గిందన్నారు. దొంగతనం కేసులు గత సంవత్సరం 259 కాగా ఈ సంవత్సరంలో 214 అయ్యి 17% తగ్గించగలిగామన్నారు. ఇందులో ప్రజలందరికీ తగు జాగ్రత్తలు తెలియజేయడం, ప్రజలతో మమేకమై గస్తీ దళాలు ఏర్పాటు చేయడం వలన సాధ్యమయ్యిందని తెలిపారు. మహిళలపై వరకటనపు వేదింపు కేసులు గత సంవత్సరం 174 కేసులు కాగా ఈ సంవత్సరంలో 167 తగ్గాయని తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు ఆరుగురు నిందుతులకు కేసులలో జీవితఖైదీ శిక్షలు, 12కేసులలో 7 సంవత్సరాల లోపు శిక్షలు పడ్డాయని తెలిపారు. ఇలా నేరాలుచేసిన వారి పై కఠినమైన చర్యలు తీసుకోవాడమే కాకుండా కచ్చితముగా శిక్షలుపడే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిపూర్ణంగా వాడుకోవడములో జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 11 మంది సభ్యులు ఒక ముఠాగా ఏర్పడి (పార్థీ గ్యాంగ్) రాత్రి సమయాల్లో జాతీయ రహదారులపై ఆగి ఉన్న వాహన దారులను లక్ష్యం గా చేసుకొని వాహనాల అద్దాలను పగులగొట్టి, వాహనదా రులపై దాడి చేసి వారిని గాయపరిచి, బెదిరించి వారి వద్ద నుండి డబ్బులు, విలువైన వస్తువులను మొబైల్ ఫోన్ లను దొంగిలిస్తున్నారని, వీరిని జిల్లా పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. సీఇఈఆర్ అప్లికేషన్ ద్వారా ఇప్పటివరకు పోగొట్టుకున్నవారి 3265 మొబైల్ ఫోన్స్ సుమారు రూ.7 కోట్ల విలువ గల వాటిని రికవరీ చేసి బాధితులకు అప్పజె ప్పామని తెలిపారు. గత 6 నెలల కాలంలోనే 452 రికవరీ చేశామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో కమీషనరేట్స్ లో కాకుండా జిల్లాల పనితీరులో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు.గాంధారి పోలీస్ స్టేషన్ పరిదిలో ఘోర రోడ్డు ప్రమాద సంఘటనలో విధి నిర్వ హణలో వడ్ల రవి (కానిస్టేబుల్) అసువులు బాయగా అతని భార్య అయిన సౌఖ్య, అదేవిధంగా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ అనారోగ్యంతో చనిపోగా కుమార్తె మానస లకు కారుణ్య నియామకాలలో భాగంగా 2 నెలల లోపే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ ఉత్తర్వులను అందజేశామని తెలిపారు. హోం గార్డు నుండి ఏఎస్ఐ స్థాయి వరకు 192 మంది సిబ్బందికి కౌన్సిలింగ్ చేసి స్పౌస్, సీనియారిటీ, హెల్త్ గ్రౌండ్స్ పరిగణలోకి తీసుకొని బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తిచేశామని తెలిపారు. రానున్న 6 నెలల కాలంలో నేరాలు తగ్గే విధంగా, ప్రజలందరికీ పూర్తి శాంతి భద్రతలతో కూడిన సమాజాన్ని అందించే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావుకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : భారతీయ జనతా పార్టీ వేద కన్వెన్షన్ లో నిర్వహించిన రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నారవరాజు రామచందర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ శాలువతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, " రామచందర్ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకులని, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంలో అనుభవం కలిగిన నేతని అన్నారు. రామచందర్ నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ మరింత బలపడుతుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అధిక సీట్లు సాధించడం ఖాయం అని ధీమా వ్యక్తం చేసారు. రామచందర్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే దిశగా పార్టీ ముందుకు సాగుతుందనే విశ్వాసం ఉందని" అన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే బాధ్యతను నూతన అధ్యక్షుడు విజయవంతంగా నెరవేరుస్తారని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు.

## క్రీడలు జీవితాన్నే మార్చేస్తాయి


### పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : క్రీడలు జీవితాన్నే మార్చేస్తాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫుట్బాల్ ఒక టీం గేమ్ అంటే ఆషామాషి క్రీడాకాదని, ఫుట్బాల్ టెక్నిక్ తో ఆడాల్సిన గేమ్ అని అన్నారు. ఫుట్బాల్ ను రోజుకు నాలుగు గంటలైనా సాధన చేసినప్పుడే ఫుట్బాల్ క్రీడా అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. చదువుతోపాటు క్రీడలు అవసరమని, రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం 350 కోట్ల నిధులను క్రీడాభివృద్ధి కొరకు కేటాయించిందని చెప్పారు. జిల్లాలో కోచ్ లు లేకుండా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. జిల్లాలో అర్జున అవార్డు గ్రహీతలు ఉన్నారని ఆయన అన్నారు. ఓడిన క్రీడాకారులు బాధపడకుండా గెలుపు కొరకు రోజు క్రీడలను సాధన చేయాలని చెప్పారు.

## పాఠశాల బాగుకోసం..

### అధికారులను కదిలించిన 'న్యాయసేవ సంస్థ'



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని ధర్మపురి హిల్స్ లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం సంద ర్శించి స్థితిగతులను తెలుసుకున్న జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు మంగళవారం నిజామాబాద్ నగర ఉత్తర, దక్షిణ తహసీల్దార్లు విజయ్ కాంత్ రావు, బాలరాజ్, నిజామాబాద్ ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్ రావు లను జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్ కు పిలిపించుకుని పాఠశాల ప్రస్తుత పరిస్థితులను వారి ముందు ఎకరువు పెట్టారు. పాఠశాలకు అధికారికంగా ఉన్న భూమి ఎంత..? ఏమైనా కబ్జాకు గురైందా..? పాఠశాలకు ప్రహరీ గోడ ఎందుకు నిర్మించలేదు, నిధులు ఉన్నాయా.. లేవా..? తదితర సమస్యలను తెలుసుకోవడానికి మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## ఏపీజే కలాం ను ఆదర్శంగా తీసుకొని దేశసేవకు సిద్ధపడాలి

ఆర్మూర్, బతుకమ్మ: "ప్రతి విద్యార్థి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయనలా దేశానికి తన జీవితాన్ని అర్పించడానికి సిద్ధంగా ఉండాలి," అని చార్టర్డ్ అకౌంటెంట్ ఈరవర్తి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా విద్యార్థులకు టాపర్మెరిట్ అవార్డులు అందజేయడంతో పాటు ఉచిత పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. విద్యకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇవ్వాలని, సెల్ఫోన్లకు బానిసలుగా మారకూడదని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఫోన్లలో ఏమి చూస్తున్నారో గమనించి, వారి చదువుల పై దృష్టి పెట్టేలా చూడాలని అన్నారు. జమాత్ జిల్లా అధ్యక్షుడు మన్సూర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ, ఖుర్ఆన్లో అవతరించిన మొదటి అయత్ 'ఇక్రా' (చదవు) అని పేర్కొంటూ, ఇస్లాం దృష్టిలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. సమాజ అభ్యున్నతికి జమాతే ఇస్లామీ హింద్ విద్యను ప్రధానంగా భావిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జమాత్ రాష్ట్ర సభ్యుడు ఎం.ఎన్. బైగ్ జహీద్, అస్లాం బిన్ మొహిసిన్, అబ్దుల్ జబ్బార్, వాజేద్, ఖాలెద్, అబ్దుల్లా, రఫీ తదితరులు పాల్గొన్నారు. అవార్డులు, పుస్తకాలు, బ్యాగులు అందుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు జమాతే ఇస్లామీ హింద్ ఆర్మూర్కు కృతజ్ఞతలు తెలిపారు.



## జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకు సన్మానం



బతుకమ్మ, భిక్కనూరు : జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కను ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ నివాసంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో 90 శాతానికి పైగా సీట్లు సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, మాజీ ఎంపీపీ రేఖ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ను కలిసిన సెర్ప్ సిబ్బంది

కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లాలో సెర్ప్, డిఆర్డిఏ సిబ్బంది బదిలీలు ప్రక్రియలో భాగంగా మంగళవారం నిజామాబాద్ నుండి ఇద్దరు డిపిఎంలు శ్రీనివాస్, సాయిలు, నిర్మల్ జిల్లా నుండి వచ్చిన శోభారాణి, సిద్దిపేట జిల్లా నుండి వచ్చిన రాజయ్య, కామారెడ్డి జిల్లాలో ఇదివరకు పనిచేస్తున్న సురేష్ కుమార్ లు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా వచ్చిన డిపిఎంలు అన్ని అంశాల్లో మోడల్ గా ఉండాలని, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ, జిల్లా సమైక్య ప్రతినిధులు, ఏపీఎంలు, స్త్రీ నిధి సిబ్బంది, జిల్లా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



## భిక్కనూరులో డాక్టర్స్ డే కార్యక్రమం



బతుకమ్మ, భిక్కనూరు : డాక్టర్స్ డే కార్యక్రమాన్ని భిక్కనూరు గ్రామంలోని పిహెచ్సిలో మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లను ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు శాలువాతో సన్మానించి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ వైద్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025 సర్వే



బతుకమ్మ, భిక్కనూరు : స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ పథకంలో భాగంగా భిక్కనూరు మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ , మల్లు పల్లి ఎంపిక చేయడం జరిగిందని డిఎల్పిఒ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సర్వే టీం ఆర్ ఐ రాణి డోర్ టు డోర్ వెళ్లి మీ ఇంటి దగ్గరికి చెత్త బండి వస్తుందా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు.మీ ఇంట్లో ఉన్న తడి పొడి చెత్తను వేరు వేరు డబ్బాల్లో ఉంచి జీపీ మిత్రులకు అందజేయాలని సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమాన

### 11మందికి జైలు శిక్ష, 6గురికి జరిమాన

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్ డివిజన్ పరిధిలో అతిగా మద్య సేవించి వాహనాలు నడిపిన 11మందికి జైలు శిక్ష, 6గురికి జరిమాన విధించినట్లు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో భాగంగా 17మంది పట్టుబడ్డారని తెలిపారు. వారికి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి మంగళవారం జిల్లా కోర్టులో హాజరు పరిచారని పేర్కొన్నారు. స్పెషల్ జుడిషియల్ 2వ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ 11మందికి జైలు శిక్ష, 6గురికి జరిమానా విధించినట్లు తెలిపారు.